# 106. ఖురైష్ (ఖురైషులు) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి. ఖురైష్ ప్రజలకు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఇందులో ప్రస్తావించడం జరిగింది. 'ఖురైష్' అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఖురైషు తెగ ప్రవక్త ముహమ్మద్(సఅసం) స్వంత తెగ. అరేబియాలో అత్యంత ఉన్నతమైన తెగ. కాబా ధర్మకర్తృత్వ బాధ్యతను నిర్వర్తిస్తున్న తెగ. అల్లాహ్ ఈ తెగకు హోదా, సంపద, భద్రతలు ప్రసాదించాడు. వారు అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించాలని, కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, దైవప్రవక్త(సఅసం)కు, అవతరిస్తున్న దైవవాణి (వహీ)కి మద్దతు ఇవ్వాలని బోధించడం జరిగింది.

## 106. ఖురైష్[1] సూరా

## سُوْرَةُ قُرَيْشٍ

అవతరణ :మక్కా ఆయతులు :4

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**1** ఖురైషులను అలవాటు చేసిన కారణంగా,

لِاِيْلٰفِ قُرَيْشٍ ۝١

**2** (అంటే) చలికాలపు, ఎండాకాలపు ప్రయాణాలకు వారిని అలవాటు చేసిన కారణంగా,[2]

اٖلٰفِهِمْ رِحْلَةَ الشِّتَآءِ وَالصَّيْفِ ۝٢

1. ఈ సూరాను **'ఈలాఫ్ సూరా'** అని కూడా అంటారు. వెనుకటి సూరా (అల్ ఫీల్ సూరా)తో ఈ సూరాకు విడదీయరాని సంబంధం ఉన్నది.

2. **'ఈలాఫ్'** అంటే అలవాటు పడిపోవటం, చేరువ కావటం అని అర్థం. అంటే ఏదైనా పనివల్ల లేక ఏదైనా వ్యవహారం వల్ల కలిగే అసౌకర్యం, ఇబ్బందిని తేలిగ్గా అధిగమించ గలగటం అన్నమాట. ఆనాడు మక్కాకు చెందిన ఖురైషు జనుల ప్రధాన వృత్తి వ్యాపారం. ఏడాదిలో రెండుసార్లు వారి వర్తకబృందాలు సుదీర్ఘ ప్రయాణాలు చేసి విదేశాలకు వెళ్ళేవి. ఉష్ణోగ్రత అధికంగా ఉండే యమన్ ప్రదేశానికి చలికాలంలో వెళ్ళి, శీతల ప్రదేశమైన సిరియాకు వేసవి కాలంలో వెళ్ళేవారు. కురైషులు కాబా గృహ సేవకులవటం చేత అరబ్బులంతా వారిని అమితంగా ఆదరించేవారు. వారు ఏ ప్రదేశాలకు వెళ్ళినా ప్రజలు హృదయ పూర్వకంగా స్వాగతించేవారు. ఈ ప్రయాణాలలో వారికెక్కడా, ఎలాంటి అవరోధాలు ఎదురయ్యేవి కావు. ఈ సంగతినే దేవుడిక్కడ ప్రస్తావించాడు. ఓ ఖురైషు జనులారా! మీకు లభించే ఈ స్వాగత సన్మానాలకు, గౌరవాదరణలకు అసలు కారణం కాబా గృహమే. ఈ కాబా గృహం వల్లనే మీరు మక్కాలో సుఖశాంతులతో వర్ధిల్లుతున్నారు.

   కాబట్టి మీరు మీ ప్రభువు దయానుగ్రహాన్ని మరువకండి. ఈ కాబా గృహం యొక్క ప్రభువును సేవించండి. ఆయనకు సాటి కల్పించకండి. ఆయన మీకు చేసిన మహోపకారానికిగాను కృతజ్ఞులై ఉండండి. ఎందుకంటే, మీ ప్రభువు అండదండలే గనక మీకు లేకుండా ఉంటే మీరు ఏడాదిలో రెండు పెద్ద ప్రయాణాలు చేయగలిగేవారు కాదు. ఏనుగుల వాళ్ళను కూడా తరిమికొట్టి మేము మీ గౌరవోన్నతులకు విఘాతం కలగకుండా చూశాము. ఒకవేళ అబ్రహాయే గనక తన దురుద్దేశంలో కృతకృత్యుడై

فَلْيَعْبُدُوْا رَبَّ هٰذَا الْبَيْتِ ۝٣

**3** వారు ఈ (కాబా) గృహం యొక్క ప్రభువునే ఆరాధించాలి.

الَّذِيْٓ اَطْعَمَهُمْ مِّنْ جُوْعٍ ۙ وَّاٰمَنَهُمْ مِّنْ خَوْفٍ ۝٤

**4** ఆయనే వారికి ఆకలిగొన్నప్పుడు అన్నం పెట్టాడు.[3] భయాందోళనల స్థితిలో భద్రత కల్పించాడు.[4]

ఉంటే మీ పేరు ప్రతిష్ఠలన్నీ మంటగలసిపోయేవి. మీ వాణిజ్యం కూడా దెబ్బతినేదే. కనుక మీరు మీ ప్రభువుకు కృతజ్ఞతాంజలి ఘటించండి. ఆయన్ని ఆరాధించండి. చిత్తశుద్ధితో కాబా గృహం సేవలు చేయండి.

3. అంటే, వర్తకం ద్వారా, సుదీర్ఘ ప్రయాణాల ద్వారా వారి ఆకలి బాధను తీర్చాడు.

4. ఆనాడు అరేబియా అంతటా అశాంతి అలజడులు ఉండేవి. సర్వత్రా రక్తపాతం జరిగేది. కాని పవిత్ర గృహం కారణంగా మక్కాలోని కురైషులకు ఈ బెడద తప్పింది. వారు సుఖంగా, ప్రశాంతంగా జీవించేవారు.